www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 27 నవంబర్ 2023

5

ఏలూరు

## రైతులను బెదిరిస్తే సహించేది లేదు

**ఏలూరు అర్బన్:** ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా జాతీయ రహదారి పక్కన ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులను హైవే పెట్రోలింగ్ పోలీసుల బెదిరించడం తగదని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సాయంత్రం దెందులూరు మండలం సత్యనారాయణపురం సమీపంలోని హైవే ప్రక్కన ధాన్యం కల్లాలను రైతు సంఘం నాయకులు పరిశీలించారు. పోలీసుల బెదిరింపులు తగవంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సామూహిక కల్లాల్లేక చాలాచోట్ల రోడ్లపైనే రైతులు ధాన్యం ఆరబెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో హైవే పెట్రోలింగ్ పోలీసులు వేధించడం అన్యాయమని విమర్శించారు. సత్యనారాయణపురం వద్ద టిఫిన్ బడ్డీలకు అవకాశం కల్పించారని, లారీలు ఇతర వాహనాలు పెట్టుకోవడానికి ఇబ్బంది రావడంతో ధాన్యం ఆరబెట్టుకోవడానికి వీలు లేదంటూ పోలీసులు చెప్పడం తగదన్నారు. ప్రభుత్వం సామూహిక కల్లాలు ఏర్పాటు చేసే వరకు రోడ్లపై ధాన్యం ఆరబెట్టుకోవడం తప్ప రైతులకు మరో మార్గం లేదన్నారు. రైతులను వేధిస్తే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సాయి, దుర్గారావు, సతీష్ పాల్గొన్నారు.

### వంకవారిగూడెంలో

# 'నేవీ యుద్ధ సామగ్రి డిపో'..!

సేకరించిన భూమి ఇదే

**భూసేకరణ వివరాలకు సంబంధించి అధికారులకు ఆదేశాలు**

**ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు**

**గ్రామసభల తీర్మానాల్లేకుండా ముందుకు**

**ప్రజాభిప్రాయం తెలుసుకోకుండానే ప్రకటనలు**

**1166.55 ఎకరాల సేకరణకు నిర్ణయం**

**ఏజెన్సీలోని జీలుగుమిల్లి మండలంపై తీవ్ర ప్రభావం**

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

**ఏజెన్సీ చట్టాలను పాలకులు తుంగలో తొక్కుతున్నారు. గ్రామసభలు నిర్వహించకుండా, తీర్మానాలు చేయకుండానే ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెం పరిసర ప్రాంతాల్లో 'నేవీ యుద్ధ సామగ్రి డిపో' ఏర్పాటుకు చకచకా పావులు కదుపుతున్నారు. భూ సేకరణకు సంబంధించిన వివరాలపై అధికారులకు ఆదేశాలు సైతం జారీఅయ్యాయి. అధికారులు కూడా సర్వేలు సైతం పూర్తి చేసేశారు. ప్రజాప్రతినిధులు, బిజెపికి చెందిన నాయకులు దీనిపై ప్రకటనలు సైతం గుప్పిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతం జీలుగుమిల్లి మండలంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలపై తీవ్ర ప్రభావం చూపే పరిశ్రమ ఏర్పాటులో ప్రభుత్వాల తీరుపై జనాల నుంచి తీవ్ర ఆగ్రహ జ్వాలాలు వ్యక్తమవుతున్నాయి.**

జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెం పంచాయతీ పరిధిలో నేవీ యుద్ధసామాగ్రి డిపో(నేవీ ఎమ్యూనేషన్ స్టోరేజ్) ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేగంగా ముందుకు సాగుతున్నాయి. పరిశ్రమ ఏర్పాటుపై ప్రజాభిప్రాయం తెలుసుకోకుండానే ఏకపక్షంగా అధికారులు ముందుకు వెళ్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాలకు రక్షణ కవచంలా ఉన్న పీసా చట్టాన్ని పూర్తిగా తుంగలో తొక్కేందుకు సిద్ధమయ్యారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఏదైనా చేయాలంటే గ్రామసభలు నిర్వహించి, తీర్మానాలు చేస్తే తప్ప ముందుకు సాగడానికి వీలుండదు. కానీ ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కి కేంద్రంలోని మోడీసర్కార్ వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. గడిచిన సెప్టెంబర్లోనే నేవీ యుద్ధసామగ్రి డిపో ఏర్పాటుకు సంబంధించిన భూసేకరణ వివరాలపై నేవీ ఆర్మమెంట్ డిపో విశాఖపట్నం చీఫ్ జనరల్ మేనేజర్ కోరుతున్నట్లు కలెక్టర్ ప్రసన్నవెంకటేష్కు, జంగారెడ్డిగూడెం ఆర్డిఒకు, జీలుగుమిల్లి తహశీల్దార్కు ఆదేశాలు సైతం జారీచేశారు. అందులో నేవీ యుద్ధసామగ్రి డిపో, రోడ్డు కనెక్టివిటీ ఏర్పాటుకు మండలంలోని వంకావారిగూడెం పరిసర ప్రాంతాల్లో భూసేకరణ వివరాలకు సంబంధించిన వివరాలను పేర్కొన్నారు. మొత్తం 1166.55 ఎకరాలు అవసరమన్నట్లు తెలిపారు. ఇందులో రూ.27.19 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి, భూమికి భూమి కింద రూ.671.60 కోట్లు, మేజర్, మైనర్ గిరిజన యువతకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలన్న అంశాలను ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కలెక్టర్కు జారీచేసిన ఉత్తర్వుల కాపీకి సంబంధించి ఇప్పటికే అక్కడి ప్రజలకు తెలియని పరిస్థితి నెలకొంది. ప్రజాభిప్రాయ సేకరణ జరగకుండా పరిశ్రమ ఏర్పాటుపై ఈతతంగమంతా చేయడం వెనుక కుట్ర దాగిఉందని స్పష్టమవుతోంది. గిరిజనులు ఒప్పుకున్నా లేకపోయినా దొంగ తీర్మానాలు సృష్టించి ముందుకు సాగుతారా అన్న సందేహాలు నెలకొన్నాయి. ఇప్పటికే పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి డ్రోన్ సర్వేతోపాటు, మిగిలిన సర్వేలు కూడా పూర్తిచేశారు. గ్రామసభలు జరిపి, ప్రజాభిప్రాయం తెలుసుకోకుండానే వైసిపి ప్రజాప్రతినిధులు, బిజెపి నాయకులు పరిశ్రమ ఏర్పాటుపై ప్రకటనలు సైతం చేస్తున్నారు. వ్యూహాత్మకంగానే ఇదంతా చేస్తున్నారన్న చర్చ నడుస్తోంది.



GOVERNMENT OF ANDHRA PRADESH
REVENUE DEPARTMENT
OFFICE OF THE COLLECTOR & DISTRICT MAGISTRATE, ELURU DISTRICT, ELURU

From: Sri V. Prasanna Venkatesh, I.A.S., Collector & District Magistrate, Eluru District, Eluru.

To: The Revenue Divisional Officer, Jangareddigudem. The Tahsildar, Jeelugumilli.

Sub: Land Acquisition – Navy – Ammunition Storage – J.R. Gudem (Ctrl) – Jeelugumilli (M) – Vankavarigudem (V) – Land required for ammunition storage and road connectivity – Additional information requested by the CGM, NAD, Visakhapatnam – Reg.

In the reference 8th cited, the Chief General Manager, Naval Armament Depot, Visakhapatnam has requested to submit the following additional information regarding Acquisition of land for an extent of Ac.1166.55 cts in Jeelugumilli Mandal.

1) No Objection Certificate
2) Encumbrance free status certificate
3) Consent /NOC from concerned Grama Sabha/Panchayats/Autonomous district councils in scheduled area in accordance with Sec 41 of RFCTLARR Act 2013.
4) Details of Environment/Statutory Clearances, if any.

Further requested the costs for the land acquisition that are required for calculating total approximate cost of the following

1. Cost of Ac.27.19 cts of Govt land.
2. R&R package of major sons and daughters of the Tribals.
3. Cost of Ac.671.60 cts of land for 'Land to Land' transfer.

In the above circumstances, the Revenue Divisional Officer, Jangareddygudem, the Tahsildar, Jeelugumilli is here by requested to enquire into the above matter and send detailed report to this office, as to send information to the Chief General Manager, Naval Armament Depot, Visakhapatnam to take further action in the matter.

Please treat this matter as 'MOST URGENT'

Yours faithfully,
For Collector, Eluru District, Eluru.

ఆర్డిఒకు, తహశీల్దార్కు ఉన్నతాధికారులు జారీచేసిన ఆదేశాల కాపీ

పరిధిలో మరకావారిగూడెం, దాట్లవారిగూడెం, వంకావారిగూడెం, కొత్తకొమ్ములవారిగూడెం, రమణక్కపేట మొత్తం ఐదుగ్రామాలున్నాయి. ఈగ్రామాల్లో దాదాపు 700 కుటుంబాలుండగా 650 ఎకరాల్లో గిరిజన కుటుంబాలే ఉన్నట్లు చెబుతున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత గ్రామం పోలవరం మండలంలోని వాడపల్లి గ్రామస్తులకు దాదాపు 70 ఇళ్లతో ఇక్కడ నిర్వాసిత కాలనీ సైతం ఏర్పాటు చేశారు. గిరిజనులకు భూమికి భూమి సైతం వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో ఇచ్చారు. ఇప్పుడు ఈప్రాంతంలో నేవీ యుద్ధసామగ్రి డిపో ఏర్పాటు చేస్తే గిరిజనులంతా ఎక్కడికిపోవాలి. ఇప్పటికే ఉన్నఊరిని వదిలి వచ్చిన వాడపల్లి నిర్వాసితులు మరోసారి ఎక్కడకు వెళ్లాలి. జీలుగుమిల్లి మండలంలో దాదాపు 17 నిర్వాసిత కాలనీలు ఏర్పాటు చేస్తున్నారు. పోలవరం నిర్వాసితులైన వేలాది కుటుంబాలు ఇక్కడకు చేరుతున్నాయి. యుద్ధసామగ్రి పరిశ్రమ ఏర్పాటైతే జీలుగుమిల్లి మండలంపైనే తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. మండలంలో ఉన్న 12 పంచాయతీల పరిధిలోని 33 గ్రామాల ప్రజల పరిస్థితి ఏమిటన్న ప్రశ్న అందరిని వెంటాడుతోంది. అమాయక గిరిజనులను మోసం చేయడం తేలికన్న కారణంతో ఇక్కడ పరిశ్రమ ఏర్పాటుకు మోడీ ప్రభుత్వం పూనుకున్నట్లు ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా గిరిజనులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది. దీనిపై ఇప్పటికే సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి.

రోడ్డున పడనున్న గిరిజనులు
జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం పంచాయతీ

# పట్టు పరిశ్రమలకు భారీగా రాయితీలు

## జిల్లా అధికారి డి.వాణి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో పట్టు పరిశ్రమ అభివృద్ధికి అన్ని చర్యలూ తీసుకుంటున్నామని, రైతులకు 90శాతం వరకూ రాయితీలు కల్పిస్తున్నట్లు పట్టు పరిశ్రమల శాఖ జిల్లా అధికారి డి.వాణి తెలిపారు. జిల్లాలో ఎన్ని ఎకరాల్లో మల్బరీ తోట సాగవుతోంది.. ప్రభుత్వం ఎంతమేర సబ్సిడీ ఇస్తుంది, పట్టుపురుగుల సరఫరాలో ఏమైనా ఇబ్బందులున్నాయా? వంటి ప్రశ్నలకు ప్రజాశక్తి జరిపిన ముఖాముఖిలో ఆమె సమాధానాలిచ్చారు.

**ప్రశ్న : పట్టు పరిశ్రమ శాఖ ముఖ్యలక్ష్యం ఏమిటి?**

జిల్లాలో రైతులను పట్టు పరిశ్రమ వైపు ఆకర్షితులను చేసి ప్రభుత్వం అందించే సబ్సిడీ అందించి తద్వారా పట్టు పరిశ్రమను అభివృద్ధి చేయడం ఈ శాఖ ముఖ్యోద్దేశం.

**ప్రశ్న : జిల్లాలో ఎన్ని ఎకరాల్లో మల్బరీ తోట సాగవుతోంది? ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది?**

జిల్లాలో 350 ఎకరాల్లో మల్బరీ తోట సాగు చేస్తున్నారు. ముఖ్యంగా భీమడోలు, నూజివీడు, ముసునూరు, చాట్రాయి, పెదవేగి, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, బుట్టాయగూడెం ప్రాంతాల్లో ఎక్కువగా సాగుచేస్తున్నారు.

**ప్రశ్న : మల్బరీ తోటల సాగుకు ప్రభుత్వం రైతులకు ఎలాంటి సబ్సిడీ అందిస్తుంది?**

మెట్ట ప్రాంతాల్లో నీటి వసతి ఉన్న రైతులకు మల్బరీ తోటలు పెంచేందుకు అనుకూలంగా ఉంటుంది. ఎకరాకు రూ.25 వేలు పెట్టుబడి అవుతుంది. అయితే ప్రభుత్వం గరిష్టంగా ఐదు ఎకరాల వరకు ఎస్సి, ఎస్టిలకు 90 శాతం, ఒసి, బిసిలకు 75 శాతం సబ్సిడీ అందిస్తుంది.

**ప్రశ్న : పట్టుపురుగులు పెంచేందుకు షెడ్డు నిర్మాణానికి ఎంత ఖర్చవుతుంది? ప్రభుత్వం ఎంత సబ్సిడీ ఇస్తుంది?**

పట్టుపురుగుల పెంపకానికి 50 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు, 18 అడుగుల ఎత్తు ఉన్న ఒక షెడ్డు నిర్మాణానికి రూ.నాలుగు లక్షలు ఖర్చవుతుండగా అందులో ఎస్సి, ఎస్టిలకు 90శాతం, బిసి, ఒసిలకు 75 శాంతం ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుంది. అలాగే పురుగుల పెంపకానికి అవసరమైన అల్మరాలకు కూడా ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుంది.

**ప్రశ్న : పట్టుపురుగులు రైతులకు ఎక్కడి నుంచి తెచ్చి అందిస్తారు? ఏ దశలో ఉన్న పురుగులను అందిస్తారు ? ఎంతకాలంలో పంట చేతికి వస్తుంది?**

రైతులు పురుగుల పెంపకం మొదలుపెట్టిన 30 రోజుల్లోనే పంట చేతికి వచ్చేలా ఎనిమిది రోజుల వయస్సు ఉన్న రెండో దశ పురుగులను రైతులకు అందించడం జరుగుతుంది. ఇందుకు అవసరమైన గుడ్లు బెంగళూరు, మైసూర్లోని సెంట్రల్ సిల్క్ బోర్డ్ నుంచి వస్తాయి. వాటిని జిల్లాలోని చింతలపూడి, కన్నాపురం, పోలసానిపల్లిలోని చాకీ సెంటర్లలో పొదిగించి రైతులకు పురుగులను అందిస్తారు.

**ప్రశ్న : మల్బరీ మొక్కలు రైతులకు ఎక్కడి నుంచి సరఫరా చేస్తారు?**

జిల్లాలోని విజయరాయిలో ఉన్న ప్రభుత్వ విత్తనక్షేత్రం నుంచి నాణ్యమైన మల్బరీ మొక్కలు రైతులకు సరఫరా చేయటం జరుగుతుంది.

**ప్రశ్న : తయారైన పట్టుగూళ్లకు మార్కెటింగ్ సదుపాయం జిల్లాలో ఎలా ఉంది? మార్కెటింగ్ కోసం ఏమైనా ప్రోత్సాహకాలు ఇస్తున్నారా?**

ఒక షెడ్డులో ఒక పంటకు 150 కేజీల వరకూ పట్టుగూళ్ళ దిగుబడి వస్తాయి. వీటికి హనుమాన్జంక్షన్లో మార్కెట్ ఉంది. ఈ మార్కెట్లో కేజీ ధర రూ.300 నుంచి రూ.500 వరకూ ఉండగా ప్రభుత్వం నుంచి కేజీకి అదనపు ప్రోత్సాహకంగా రూ.50 రైతుకు ఇస్తారు.

**ప్రశ్న : పట్టు పరిశ్రమ శాఖ ద్వారా ఈ ఏడాది టార్గెట్ ఎంత? ఇప్పటి వరకూ ఎంత పూర్తయింది?**

ఈ ఏడాది 300 ఎకరాల్లో మల్బరీ తోట పెంపకం టార్గెట్ కాగా 75 శాతం పూర్తి చేశాము. అలాగే గత సంవత్సరం 30 షెడ్ల టార్గెట్ కాగా ఆ లక్ష్యం పూర్తిచేశాము.

**ప్రశ్న. పట్టు పరిశ్రమపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఎలాంటి కార్యక్రమాలు శాఖ ద్వారా చేపడుతున్నారు?**

'పట్టు బడి' పేరుతో గ్రామాల్లో పట్టుపరిశ్రమపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాము. అలాగే పట్టు పరిశ్రమ రైతులకు ఆధునిక సాంకేతిక పద్ధతుల గురించి ఎప్పటికప్పుడు తెలియజేసి అధిక దిగుబడి పొందేలా రైతులకు అవగాహన కల్పిస్తాము.

# రజకుల జిఒలు పటిష్టంగా అమలు చేయాలి

## రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి జిల్లా రజక జన సంఘ అధ్యక్షులు కట్లయ్య

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో వెనుకబడిన రజకులను ఆదుకోవాలని, రజకుల సంక్షేమానికి కేటాయించిన జిఒలను పటిష్టంగా అమలుపరిచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి జిల్లా రజక జన సంఘ అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. ఆదివారం స్థానిక రజక సంఘ భవనంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజకుల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆకివీడు మున్సిపాలిటీలో 50 సంవత్సరాల నుండి రజకులు వృత్తి చేసుకుంటున్న చెరువును మున్సిపాలిటీ వారు లీజు ఆపడంతో ఆ మున్సిపాలిటీకి తగు సూచనలు చేస్తానని కలెక్టర్ ప్రశాంతి చెప్పారని, తాడేపల్లిగూడెం మండలం రజకుల చెరువు విషయం, మాధవరం రజకుల చెరువు సమస్యలతో పాటు భీమవరం మండలం కొమరాడ రజకుల చెరువు, వీరవాసరం మండలం నౌడూరు రజకుల చెరువు విషయం కూడా డిపిఒ మల్లికార్జునరావు దృష్టికి తీసుకెళ్లామని ఆయన తెలిపారు. జంగారెడ్డిగూడెంలో అక్కమ్మకోనేరు చెరువు రజకులకే చెందేలా చూడాలని కోరారు. రజకులకు వృత్తి చెరువులపై లీజు రద్దు చేసి యాజమాన్యపు హక్కు కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం వారికి రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, 50 సంవత్సరాలు దాటిన రజకులకు కూడా పెన్షన్లు ఇవ్వాలని సమావేశంలో తీర్మానించారు. జిల్లా రజక నేతలు వి.శ్రీనివాస్రావు, కొమ్మంటి మురళీ, కుమ్మరికుంట వీర్రాజు, లక్ష్మీపసన్న ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు ప్రభుత్వ విధానాల వల్ల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, భవన నిర్మాణ కార్మికుల పోరాటాల ద్వారా సాధించుకున్న వెల్ఫేర్ బోర్డును జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి శుక్ల బోయిన రాంబాబు తెలిపారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ చట్టాలు, పథకాలు అమలు చేయాలని విజయవాడ జింఖానా గ్రౌండ్స్లో నవంబర్ 27, 28న జరిగే మహాధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని ఆదివారం కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాలుగా సంక్షేమ పథకాల అమలు జరపకుండా మెమో 1214 తీసుకొచ్చారన్నారు. 2008లో అప్పటి వైసిపి ప్రభుత్వం ఉండగా కార్మికులందరూ పోరాడి సాధించుకున్న వెల్ఫేర్ బోర్డు నిర్వీర్యం చేసేలా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. కార్మికులకు ప్రమాదవశాత్తు మరణానికి, సహజ మరణానికి, వివాహ పరిహారం, పిల్లలు పుట్టిన సందర్భంగా ఇచ్చే పరిహారాలను చాలా అన్యాయంగా ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు సంక్షేమ పథకాల కోసం యజమానుల నుంచి వసూలు చేసిన రూ.1,250 కోట్ల సంక్షేమ బోర్డు నిధులను ప్రభుత్వం అన్యాయంగా దారి మళ్లించిందని, కార్మికుల సంక్షేమానికి ఉపయోగించాల్సిన కోట్ల రూపాయల నిధులను తమ సొంత ప్రయోజనాలకు అడ్డగోలుగా జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం ఖర్చు చేసిందని, ఆ నిధులను వెంటనే సంక్షేమ బోర్డుకి జమ చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన భవన నిర్మాణ కార్మికులు పెండింగ్ క్లైములు పరిష్కరించాలని కోరారు. 50 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికులకు రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలి తెలిపారు. అనంతరం ప్రజలు, కార్మికులు, రైతుల వద్దకు వెళ్లి కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో వి.నాగేశ్వరరావు, కె.సతీష్, పి.శ్రీను, బి.వెంకన్న, డి.సత్తిబాబు పాల్గొన్నారు.

**ముసునూరు:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ రైతులను, కార్మికులను దగా చేస్తూ పరిపాలన చేస్తున్నాయని సిఐటియు జిల్లా నాయకులు జి.రాజు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 27, 28న విజయవాడలో జరుగు మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని 16 గ్రామాల రైతులకు, కార్మికులకు, కర్షకులకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నుముక అంటూ రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని, రైతు నష్టపోతే ఆ పంటకు ఇన్సూరెన్స్ ఇవ్వడం లేదని తెలిపారు.

# 36 మంది విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

76వ ఎన్సిసి దినోత్సవం సందర్భంగా ఆదివారం ఏలూరు సర్ సిఆర్ రెడ్డి డిగ్రీ కళాశాలలో ఎన్సిసి విభాగం, 19 ఆంధ్ర బెటాలియన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 36 మంది విద్యార్థులు రక్తదానం చేశారని జిల్లా రెడ్క్రాస్ ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎన్సిసి 19 ఆంధ్ర బెటాలియన్ ఇన్ఛార్జి కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నాల్ సమీర్ కర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 4వ ఆదివారం ఎన్సిసి దినోత్సవం జరుపుకుంటామని, ఇది ఏర్పడడానికి ముఖ్య ఉద్దేశం పాఠశాల, కళాశాలల స్థాయి నుంచి యువతను నాయకత్వ, దేశభక్తి, క్రమశిక్షణ గల పౌరులుగా తీర్చిదిద్ది, సైనిక శిక్షణను ఇచ్చి దేశానికి అత్యవసర పరిస్థితుల్లో ఈ సేవలను వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఏర్పడిందన్నారు. అందుకోసమే ఎన్సిసి విద్యార్థులకు పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా పాల్గొనేలా శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్ సిఆర్ఆర్ కళాశాల కరస్పాండెంట్ కె.విష్ణు మోహన్, ప్రిన్సిపల్ డాక్టర్ కెఎ.రామరాజు, ఎన్సిసి ఆఫీసర్ డాక్టర్ ఎం.నవీన్ కుమార్, డాక్టర్ ఆర్ఎస్ఆర్ కె.వరప్రసాదరావు, పిఆర్ఒ కెవి రమణ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరిస్తున్న తానేటి వనిత

# అంబేద్కర్ ఆశయ సాధనే ప్రభుత్వ లక్ష్యం

## రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత

ప్రజాశక్తి - దెందులూరు/ఏలూరు టౌన్

అంబేద్కర్, బాబూజగ్జీవన్రామ్ ఆశయాలకు అనుగుణంగా సమాజంలో సమానత్వం కోసం జగనన్న ప్రభుత్వం కృషి చేస్తోందని, రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తోందని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత తెలిపారు. దెందులూరు మండలం కొవ్వలి దళితవాడలో ఎంఎల్సి పండుల రవీంద్రబాబు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన అంబేద్కర్ విగ్రహావిష్కరణకు, గ్రామ కచేరి చావడి ప్రారంభోత్సవాలకు వనిత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ గంటా పద్మశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ భారత రాజ్యాంగ దినోత్సవం రోజున తాను అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. సమానత్వం తీసుకువచ్చేందుకు అంబేద్కర్, జగ్జీవన్రామ్ వంటి మహనీయులు అహర్నిశలు కృషిచేశారన్నారు. అంబేద్కర్ కృషి ఫలితంగానే ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం రూపుదిద్దుకుందన్నారు. ప్రపంచ దేశాల రాజ్యాంగాల కంటే భారతరాజ్యాంగం ఉన్నత విలువలు కలిగిఉందంటూ మన్ననలు పొందిందన్నారు. భారత రాజ్యాంగం ప్రసాదించిన హక్కులతోనే దళితులకు, బడుగు బలహీనవర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయం ఇలా అన్నిరంగాల్లోనూ అవకాశాలు లభించాయన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిగా సిఎం జగన్ రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారన్నారు. దళిత మహిళలైన తనకు హోం మంత్రి పదవి ఇచ్చారన్నారు. రాష్ట్రంలో బిసి, ఎస్సి, ఎస్టి మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో 70 శాతం మందిని బిసి, ఎస్సి, ఎస్టి మైనార్టీలకు అవకాశం కల్పించి సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన ఘనత జగన్కే దక్కుతుందన్నారు. తొలుత కొవ్వలిలో గాంధీనగరం పెట్రోల్ బంక్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు.

డెంటల్ క్లీనిక్ను ప్రారంభిస్తున్న ఎంపీ

# డెంటల్ క్లినిక్ ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి - చింతలపూడి

మెట్టప్రాంతంలో అత్యాధునిక టెక్నాలజీతో మల్టీ సూపర్ స్పెషాలిటీ డెంటల్ క్లీనిక్ పెట్టడం అభినందనీయమని ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. చింతలపూడి పట్టణంలో జిబిజి రోడ్డులో శ్రీరామ మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానాకిరెడ్డి, వెంకటాద్రిగూడెం సర్పంచి రామారావు, గిరిభోగరావు, వెంపాకృష్ణ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న నాయకులు

# మోడీ రాకను వ్యతిరేకిస్తూ నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తిరుమల తిరుపతి వెంకన్న సాక్షిగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పిస్తామని హామీ ఇచ్చి మోసం చేసిన ప్రధాని మోడీ తిరుపతి పర్యటనను నిరసిస్తూ మోడి గో బ్యాక్ అంటూ సిపిఎం, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సిపిఐ ఆధ్వర్యంలో ఏలూరు పాతబస్టాండ్ సెంటర్ వద్ద ఆదివారం నిరసన తెలిపారు. సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు, సిపిఐ నాయకులు పొట్టేలు పెంటయ్య మాట్లాడుతూ 2014లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని మోడీ తిరుపతి వెంకన్న సాక్షిగా బహిరంగ సభలో హామీ ఇచ్చారన్నారు. తొమ్మిదేళ్లు గడిచినా మాట మాత్రం నిలబెట్టు కోలేదని విమర్శించారు. నేడు ఏం ముఖం పెట్టుకుని తిరుపతి వెంకన్న దర్శనానికి వస్తున్నారని ప్రశ్నించారు. ఇచ్చిన హామీ ప్రకారం ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, విభజన హామీలు, కడప ఉక్కు కర్మాగారం, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు ఇలా ఎలాంటి హామీలనూ అమలు చేయక పోవడం వల్ల, నేడు రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయిందన్నారు. పైగా ఆంధ్రులు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటుపరం చేస్తుందని విమర్శించారు. బిజెపి చేసిన మోసాన్ని ప్రజలంతా గమనించాలని కోరారు. బిజెపికి వత్తాసు పలుకుతున్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు తమ తప్పులు గ్రహించి, రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం పోరాడాలన్నారు. లేకుంటే ఈ పార్టీల వల్ల రాష్ట్రానికి మరింత అన్యాయం జరుతోందన్నారు. ప్రజానీకం ఈ పార్టీలపై ఒత్తిడి చేయాలని కోరారు. బిజెపి నాయకులు మోడి ఇచ్చిన హామీ ప్రకారం ప్రత్యేక హోదా తేకుంటే రాష్ట్రంలో ప్రజల ముందు ద్రోహులుగా నిలబడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.సోమయ్య, ఆర్.లింగరాజు, కె.శ్రీనివాస్, వి.సాయిబాబు, బి.జగన్నాధరావు, కె.రామాంజనేయులు, వివివిఎన్.ప్రసాద్, సిపిఐ(ఎంఎల్ )న్యూ డెమోక్రసీ నాయకులు యర్రా శ్రీనివాసరావు, వెంకటరత్నం, కాకి నాని, గడసాల రాంబాబు, సిపిఐ నాయకులు ఎస్కె.హకిం పాల్గొన్నారు.

# 4న ఛలో ఢిల్లీని జయప్రదం చేయాలి

## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భారత రాజ్యాంగం కల్పించిన దళిత హక్కుల పరిరక్షణ కోసం, సామాజిక న్యాయం కోసం, దళిత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 4న ఢిల్లీలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం సంఘం జిల్లా కమిటీ, ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక సంఘం కార్యాలయంలో ఎం.జీవరత్నం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సామాజిక హక్కులు, ఆర్థిక, భూమి, దళిత సమస్యలు తదితర 21 డిమాండ్ల పరిష్కారం కోసం భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు కోటి సంతకాలతో కూడిన విజ్ఞాన పత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. మనకు స్వతంత్రం వచ్చి 76 సంవత్సరాలు పూర్తయినా నేటికీ దళితులపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్లో మనువాదుల చేతుల్లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేయటం యావత్ భారతదేశాన్ని తలదించుకునేలా చేసిందని మండిపడ్డారు. దళిత హక్కులను పాలక పక్షాలు హరించి వేస్తున్నాయని విమర్శించారు. ఎస్సి, ఎస్టి బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేయకుండా దళితులకు ప్రభుత్వం ద్రోహం చేస్తుందన్నారు. అలాగే ఉపాధి హామీ పథకంలో ప్రతి ఒక్కరికి 200 రోజుల పని దినాలు కల్పించి, కనీస వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం దళిత సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ 4న ఛలో ఢిల్లీ మహా ధర్నా కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎ.రవి, తామా ముత్యాలమ్మ, ఎస్.మహంకాళి రావు, సహాయ కార్యదర్శి సుధారాణి, జిల్లా నాయకులు ఎస్.కోటేశ్వరరావు, రవీంద్రర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ


దుప్పట్లు అందజేస్తున్న కౌన్సిల్ ఛైర్మన్ పి.అప్పారావు

## పేదలకు దుప్పట్ల పంపిణీ

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

ముదినేపల్లిలోని ఆర్‌సియం సహాయ మాత చర్చి ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముదినేపల్లిలోని పోల్‌రాజ్ కెనాల్ గట్టుపై నివసిస్తున్న వందమంది ఎస్‌టిలకు(యానాదులు) పునీత విన్సెంట్ డిపాల్ సొసైటీ ఆధ్వర్యంలో సమకూర్చిన చలి దుప్పట్లను విచారణ కౌన్సిల్ ఛైర్మన్ పోలాకు అప్పారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విచారణ గురువులు ఫాదర్ మాతంగి మరియ కుమార్, సహాయ గురువులు విజయ్ కుమార్, సంఘ పెద్దలు ముత్యాల జోసఫ్ రాజు, పంతగాని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## తపన ఆధ్వర్యాన క్రికెట్ కిట్ల పంపిణీ

**ప్రజాశక్తి - కొయ్యలగూడెం**

తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు క్రికెట్ కిట్లు ఆదివారం పంపిణీ చేశారు. తపన ఫౌండేషన్ అధినేత గారపాటి సీతారామాంజనేయ చౌదరి సౌజన్యంతో ఈ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ సత్యనారాయణ తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో క్రీడల ప్రోత్సాహానికి తపన ఫౌండేషన్ కృషి చేస్తుందని సంస్థ ప్రతినిధి ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కట్ట సత్యనారాయణ, క్రీడాకారులు, బిజెపి యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

## పలుచోట్ల 'భవిష్యత్‌కు గ్యారెంటీ'

**ప్రజాశక్తి - కొయ్యలగూడెం**

కొయ్యలగూడెం పట్టణం తూర్పుపేటలో ఆదివారం భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు ఆకుల అరుణ పార్టీ నాయకులతో కలిసి ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలు చేసే సంక్షేమ పథకాల మేనిఫెస్టో ప్రజలకు వివరించారు.

**బుట్టాయగూడెం:** మండలంలోని నిమ్మలగూడెం పంచాయతీ పాలకుంట గ్రామంలో జరిగిన 'బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు పాల్గొని గ్రామంలో ప్రజావేదిక నిర్వహించి టిడిపి అధికారంలోకి రాగానే అమలు చేసే సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. గ్రామంలో నెలకొన్న సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మొగపర్తి సోంబాబు, రాష్ట్ర ఎస్‌టి సెల్ కార్యదర్శి సున్నం నాగేశ్వరరావు, నియోజకవర్గ ఎస్‌టి సెల్ అధ్యక్షులు మడకం రామకృష్ణ పాల్గొన్నారు

## ఆర్‌టిసి కార్మికుల ఆందోళన

**ప్రజాశక్తి - నూజివీడు రూరల్**

పట్టణంలోని ఎపిఎస్‌ఆర్‌టిసి డిపో గ్యారేజ్ ప్రధాన ద్వారం వద్ద ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు రంగు శ్రీనివాసరావు మాట్లాడుతూ డిపో ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ వేధింపులు తట్టుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే డిపోలో విచారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల ఛార్ట్ తక్షణమే అమలు జరిపించాలని తెలిపారు.

## ఏలూరుకు జయహో జగనన్న పాదయాత్ర

**ప్రజాశక్తి - ఏలూరు టౌన్**

జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలి అనే ధృఢ సంకల్పంతో విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం బొద్దవల గ్రామం నుంచి తిరుమల తిరుపతి వరకు సుమారు 820 కిలోమీటర్లు, 43 రోజులు నిర్విరామంగా జరుగుతున్న జయహో జగనన్న చలో తిరుమల పాదయాత్ర ఆదివారం ఏలూరు జిల్లా విచ్చేసింది. అనంతరం కృష్ణా జిల్లాలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఎంఎల్‌సి ఇందుకూరి రఘురాజు పాదయాత్రకు సంఘీభావం తెలియజేసి వారిని జిల్లా సరిహద్దులు దాటే వరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ కలిసి పాదయాత్ర చేశారు. ఈ కార్యక్రమంలో పెదపాడు ఎంపిపి బత్తుల రత్నకుమారి, వైస్ ఎంపిపి రెడ్డి స్వర్ణకుమారి, కలపర్రు సర్పంచి కోటిరెడ్డి, కొక్కిరపాడు సర్పంచి మరీదు రెడ్డియ్య పాల్గొన్నారు.

## స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలు అందజేత

**ప్రజాశక్తి - పోలవరం**

ఎడ్లగూడెంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ బుక్, విజిఎస్ డిక్షనరీలను మల్లిపూడి రాజేష్ ఆదివారం అందజేశారు. విద్యతోనే ప్రతిఒక్కరూ ప్రతిభావంతులు అవుతారని అందుకు తమ వంత సహాయంగా విద్యార్థులకు బుక్స్ ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పేద విద్యార్థులను ప్రోత్సహిస్తున్న రాజేష్‌ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సమూయేలు రాజు, విజివి నాని, వె.ప్రసాద్ పాల్గొన్నారు..

## రూ.9 లక్షలతో కోర్టు ప్రాంగణ ముఖద్వారం

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

రెడ్‌క్రాస్ ఛైర్మన్ కృష్ణారెడ్డి

జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈశాన్య ముఖద్వారాన్ని నిర్మించడానికి సుమారు రూ.9 లక్షల ఖర్చు అయిందని ఎపి బార్ కౌన్సిల్ మెంబర్, న్యాయవాది బివి.కృష్ణారెడ్డి అన్నారు. ఈ ముఖద్వారాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి, పశ్చిమగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ కుమార్‌తో కలిసి శనివారం సాయంత్రం ప్రారంభించి తనను అభినందించడం తనకెంతో సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. ఆదివారం ఆయన ప్రజాశక్తితో ప్రత్యేకంగా మాట్లాడుతూ గతంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో మినరల్ వాటర్ ప్లాంట్, బివిఎ రంగారెడ్డి సమావేశ మందిరం, న్యాయ దేవత విగ్రహం ఏర్పాటు చేయడం, పోస్ట్ ఆఫీస్ ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు ఎన్నో చేశానని తెలిపారు. సంపాదించడమే కాకుండా సంపాదించిన దాంట్లో కొంత సేవా కార్యక్రమాలకు ఉపయోగించటం తనకు ముందు నుంచి ఉన్న అలవాటు అని, ఆ సేవా భావంతోనే రెడ్‌క్రాస్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యానని, తద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేయటం ఎంతో సంతృప్తినిస్తుందని ఆయన తెలిపారు.

## 1108 శివలింగాలకు అభిషేకం

**కొయ్యలగూడెం:** కార్తీక పౌర్ణమి సందర్భంగా కొయ్యలగూడెంలో శ్రీవాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం 1108 శివలింగాలకు, మీనాక్షి దేవి సమేత సుందరేశ్వర స్వామికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

## నేరాలు - ఘోరాలు

### నాటుసారా స్వాధీనం

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని కామయ్యపాలెం చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా తెలంగాణ రాష్ట్రం నుంచి మైసన్నగూడెం గ్రామానికి టి.నరేష్ అనే వ్యక్తి తన వద్ద ఉన్న సంచిలో 10 తెలంగాణ మద్యం బాటిళ్లతో వస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. మద్యాన్ని సీజ్ చేసి, ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

వర్షానికి నేలకొరిగిన వరి చేలు

ధాన్యం పరదాపై వర్షపు నీరు

## వణికిస్తున్న వాతావరణం

### అన్నదాత ఆందోళన

**ప్రజాశక్తి - ముసునూరు**

**మబ్బులతో కూడిన వర్షపుజల్లులు పడటంతో రైతుల గుండెల్లో గుబులు పట్టుకుంది. వరి కోత యంత్రాలతో ధ్యానం పంట కోత కోసే సమయంలో జల్లులు పడటంతో రైతు వెన్నులో దడ వస్తుంది. వర్షం ఎక్కువగా కురిసిన గ్రామాల్లో పుగాకు, మొక్కజొన్న పంటలు మొదట్లోనే వేరుకుళ్లి తెగులు ఆశించి దున్నేసిన వందల ఎకరాల్లో నష్టం వాటిల్లింది. పంట మొదటి దశలోనే నష్టం చవి చూసిన రైతన్నలను ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకొంటున్నారు.**

ఆరుకాలం కష్టపడి పంట పండిస్తే రైతుకు చేతికోచ్చే సమయంలో తుఫాన్‌ల ప్రభావంతో నష్టం చవి చూడాల్సిన పరిస్థితి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూజివీడు డివిజన్ ముసునూరు మండలంలోని రబీ పంటలైనా పుగాకు, మొక్కజొన్న, పత్తి పంటలకు పెట్టింది పేరు. అలాంటి పంటలకు మొదటి దశలోనే అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురవడంతో ముసునూరు, కాట్రేనిపాడు, గోపవరం, కోర్లగుంట, తాళ్లవల్లి, చెక్కపల్లి, గుళ్లపూడి, గిడిపాడు గ్రామాల్లో గత ఇరవై రోజుల నుంచి రోజూ ఏదోక గ్రామంలో వర్షంపడి తీవ్ర నష్టం వాటిల్లడంతో రైతులకు ఏం చేయాలో తెలీని పరిస్తితి నెలకొంది. ముసునూరు, కాట్రేనిపాడు, గోపవరం గ్రామాల్లో పుగాకు, మొక్కజొన్న పంటలు అక్టోబరు సీజన్‌లో మొదలు పెట్టడంతో తుఫాన్ ప్రభావంతో పుగాకు పంటలు సుమారు 50 ఎకరాల్లో, మొక్కజొన్న సుమారు 45 ఎకరాల్లో పాసి తెగులు ఆశించడంతో మొదటి దశలోనే పంటలు దున్నేశారు. ఒక్కో రైతుకు ఎకరానికి దుక్కులు ఖర్చు రూ.10వేలు, సాళ్లు తోలడానికి ఎండ్లకు రూ.3వేలు, విత్తనాలు, మందుల ఖర్చు రూ.5వేలు, కూలీల ఖర్చు రూ.2,700లు అవుతుందని, ఈ ఖర్చులంతా మరలా పంట వేయడానికి అవుతుందని, ఇలా రెండుసార్లు రైతులు పెట్టుబడులు పెట్టే పరిస్థితి వుందని వాపోతున్నారు. చేతికొచ్చే వరి పంటలు తడిసి ముద్దవ్వడం, వరిగడ్డ కట్ట రూ.100 ఒకటి పలికే పరిస్థితి వుందని, వరికోత యంత్రాలకు మంచి గిరాకీ పెరగడంతో రేట్లు పెంచడం, ధ్యానం కల్లాల్లోనే పట్టాల కింద వుండటంతో ఆరపెట్టడానికి కుడా ఎండలేని పరిస్థితి ఉందంటున్నారు. పండించిన పత్తి పంటకు అంతాంత మాత్రాన ధర వుందంటే వర్షాలకు తడవటం, కూలీల కొరత ఏర్పడటం, అదేవిధంగా వలసపల్లి, గుడిపాడు, గుళ్లపూడి, ఎల్లాపురం, బలివే, ముసునూరు గ్రామాల్లో మిర్చి పంటకు కుడా బూజు తెగులు, వేరుకుళ్ళ తెగులు ఆశించడంతో ఈ రబీ పంటల సీజన్‌లో ఏ పంటకు వాతవరణ పరిస్థితులు అనుకూలంగా లేవు. సంవత్సర కాలంలో ఒక పంటగా పండించే పుగాకు, మొక్కజొన్న, మిర్చి పంటల రైతులు మరలా వచ్చే ఏడాది వరకు ఎలా అంటూ అప్పుల బాధలో సతమతమవుతూ త్రీవ మనోవేదనకు గురిఅవుతున్నారని చెప్పవచ్చు.

## ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ఏలూరులో రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ చేసున్న సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

లౌకిక రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి ప్రజలంతా ప్రతీన భూనాలని సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, నాయకులు బి.సోమయ్య, పంపన రవి, వి.సాయి బాబు, బి.జగన్నాధ రావు, సత్యనారాయణ, రామాంజనేయులు, కోటేశ్వరరావు, అంతోని, సిపిఐ నాయకులు పోటేలు పెంటయ్య, హకీమ్ పాల్గొన్నారు.

**చింతలపూడి:** డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కలలు సహకరం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన ఉందని, రాజ్యాంగాన్ని గౌరవిద్దామని ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు అన్నారు. పట్టణంలో నవంబర్ 26న భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగర పంచాయతీలోని పాతబస్టాండ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జానాకిరెడ్డి, అంబేద్కర్ వాది, కలుకూర్తి నాగేశ్వరావు, వెంపాకృష్ణ, గిరిభోగరావు పాల్గొన్నారు.

**కొయ్యలగూడెం:** అందరికీ సమాన హక్కులు, సమాన అవకాశాలు అనే సిద్ధాంతంతో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రచించడం జరిగిందని పరింపుడి గ్రామపంచాయతీ సర్పంచి ముప్పిడి విజయకుమారి చినబాబు పేర్కొన్నారు. కొయ్యలగూడెం పట్టణంలో ఎస్‌సి కాలనీలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్‌సి కాలనీ అధ్యక్షుడు బొబ్బర చిట్టిబాబు ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ పూలపల్లి రవికుమార్, బొబ్బర జెషీల్, పాత కాకుల రత్నరాజు పాల్గొన్నారు.

**చాట్రాయి:** 73వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం చిన్నంపేట గ్రామంలో జై భీమ్ అంబేద్కర్ సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చిన్నంపేటలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొమ్ము సుజాన్ రావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనంద్, కొమ్ము నాగేశ్వరరావు, కొమ్ము చంటి పాల్గొన్నారు.

స్వేచ్ఛ, సమానత్వం కలిగిన విశిష్టమైన రాజ్యాంగం మన భారతదేశ రాజ్యాంగం అని మండల విద్యాశాఖ అధికారి ఎస్‌విఎస్ బ్రహ్మచారి అన్నారు. సూరంపాలెం మండల పరిషత్ పాఠశాలలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.ముత్తయ్య, ఉపాధ్యాయిని సిహెచ్.అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

**టి.నరసాపురం :** భారత రాజ్యాంగం పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పోలవరం నియోజకవర్గ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా మండలంలోని బొర్రంపాలెం గ్రామం ప్రధాన సెంటర్‌లో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి ఎంఎల్‌ఎ, మండల జెడ్‌పిటిసి సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తోట గంగాధర్ రావు, పల్లా రమేష్ పాల్గొన్నారు.

**జంగారెడ్డిగూడెం:** భారత రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులు, విధులపై పౌరులందరూ అవగాహన పెంపొందించుకోవాలని ఎంఎల్‌ఎ ఎలిజా అన్నారు. ఆదివారం బస్టాండ్ సెంటర్ వద్ద 76వ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త అలుగు ఆనంద శేఖర్, జెడ్‌పిటిసి పోల్నాటి బాబ్జి పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన పొందాలని డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షులు నేలపోలు ప్రభాకర్ రావు తెలిపారు. డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ అడ్మిన్ చిట్టిబాబు, డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపకులు అమృతల రంగా పాల్గొన్నారు.

**కలిదిండి:** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని సానారుద్రవం ప్రధాన కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి సిఐటియు మండల కార్యదర్శి జక్కుల మహేష్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కలిదిండి ప్రధాన సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి టిడిపి మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, వల్లభనేని శ్రీనివాస చౌదరి, లంకా రత్నరావు, నున్న రమాదేవి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**ముసునూరు:** మండలంలోని 16 గ్రామాల్లో ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముసునూరులో ఎంపిడిఒ జి.రాణి, తహశీల్దార్ దాసరి సుధ, ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, ఎంపిడిఒ ఆఫీస్ ఎఒ కూచిపూడి సాయిరామ్, కోర్లగుంటలో సర్పంచి నక్కబోయిన సత్యనారాయణ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**ఏలూరు టౌన్:** దేశానికి దిక్సూచి అయిన బిఆర్.అంబేద్కర్ చిత్రాన్ని భారత కరెన్సీపై ఎందుకు ముద్రించలేదో ఈ దేశ పాలక, ప్రతిపక్ష పార్టీలు దళిత, బహుజన సమాజానికి సమాధానం చెప్పాలని జాతీయ సీనియర్ దళిత నేత, అసెంబ్లీ స్థానాలు పెంపు సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పొలిమేర హరికృష్ణ డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి, జెఎసి నాయకులు పాక ప్రభాకర్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి, జెఎసి నాయకులు పలువురు పాల్గొన్నారు.

**నూజివీడు రూరల్:** పట్టణంలోని ఎంఎల్‌ఎ కార్యాలయంలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి ఎంఎల్‌ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దేశిరెడ్డి రాఘవరెడ్డి, ప్రజా ప్రతినిధులు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

**జీలుగుమిల్లి:** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సుందర్ సింగ్, ఎంపిడిఒ కృష్ణ ప్రసాద్‌లు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కెఆర్ఎస్.కృష్ణప్రసాద్, ఎస్ఎ.రమణ పాల్గొన్నారు.

**ఆగిరిపల్లి:** భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎన్.చంటిబాబు, ఎఎస్ఐ తప్లీర్‌నాయక్, కానిస్టేబుల్స్ సురేష్ పాల్గొన్నారు.

**ముదినేపల్లి:** సామాజిక న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలకు పెద్దపీట వేస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగాన్ని రచించిన రూపకర్త అంబేద్కర్ అని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య అన్నారు. ముదినేపల్లి సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మాల మహానాడు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు సేవ నాగ జగన్ బాబురావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండల తహశీల్దార్ కె.శ్రీనివాస్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షులు మొట్రూ ఏసుబాబు, వైసిపి నాయకులు బేతపూడి వెంకటరమణ పాల్గొన్నారు.

**పోలవరం:** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలవరం పంచాయతీలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవం వేడుకలు ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బుగ్గ మురళీకృష్ణ పాల్గొన్నారు.

గోతులమయంతో రహదారి

కంద్రిగగూడెం రహదారి

## మాకు రోడ్డేయండి మహాప్రభో..!

**ప్రజాశక్తి - చింతలపూడి**

**మాకు రోడ్డు కావాలి, వీధిలైట్లు కావాలని అడిగినా పట్టించుకునే నాథులే లేరు. రోడ్డు లేక నానా ఇబ్బందులు పడుతున్నామని, అర్ధరాత్రి బయటకు వెళ్లాలంటే పాదచారులకు వెన్నులో వణుకు వస్తుందని, వీధిలైట్లు లేకపోవటంతో రోడ్డు మీదకు ఏ విషసర్పం వస్తుందో తెలియక ఆ గ్రామంలో ఉన్నవారంతా ఆందోళన చెందుతున్నారు... ఆ గ్రామంలో ఉన్నవారంతా నాయకపోడు కులస్తులే.**

మండలంలోని కంద్రిగగూడెంలో సుమారు వెయ్యి మంది జనాభా కలిగి ఉన్న ఆ గ్రామానికి దాదాపు 12 సంవత్సరాల నుంచి రోడ్డు లేక నానా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా కంద్రికగూడెం ఊరు నుంచి అల్లిపల్లికి వచ్చే రోడ్డు చుట్టు పక్కల తోటలు ఉండటంతో విషసర్పాలు సంచరిస్తూ ఉంటాయని, పాదచారులకు ముఖ్యంగా విద్యార్థులకు విషసర్పాలు అడ్డుపడుతున్నాయని వారు భయాందోళన చెందుతున్నారు. రాత్రిపూట సంచరించాలంటే భయంగా ఉంటుందన్నారు. గతంలో అనేక మార్లు అధికారులకు తమ సమస్యను విన్నవించుకున్నా నేటికీ ఆ సమస్య పరిష్కారం కాలేదని చెబుతున్నారు. అత్యవసర సమయాల్లో రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని, ఉన్నతాధికారులు దృష్టిసారించి, రోడ్డు, వీధిలైట్లు వేయించాలని గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

### సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం

**ఎంపిడిఒ మురళీకృష్ణ, చింతలపూడి**

దీనిపై పూర్తి వివరాలు సేకరించి, ఆ గ్రామం సమస్యను పరిష్కరించటానికి కృషి చేస్తాం. వీధిలైట్లు ఏర్పాటు చేయిస్తాం. రోడ్డు గురించి ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ అధికారులతో చర్చించి సమస్య పరిష్కరానికి కృషి చేస్తాం.

### అధికారులు దృష్టి సారించాలి

**అప్పిరెడ్డి నాగు, కంద్రికగూడెం, నాయకపోడు రాష్ట్ర అధ్యక్షులు**

మా గ్రామనికి గత 12 సంవత్సరాలుగా రోడ్డు లేక నానా ఇబ్బందులు పడుతున్నాం. వీధిలైట్లు కూడా లేని పరిస్థితి. అధికారులు దృష్టిపెట్టాలని కోరుకుంటున్నాం.

## విద్యార్థులకు డ్రగ్స్ అనర్థాలపై అవగాహన

**ప్రజాశక్తి - నూజివీడు రూరల్**

నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో నూజివీడులోని సాంఘీక సంక్షేమ శాఖ సమీకృత బాలుర వసతి గృహం, సాంఘీక సంక్షేమ బాలికల వసతి గృహం విద్యార్థులకు వేరు వేరుగా మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ జాకబ్ రాజు మాట్లాడుతూ మత్తు పదార్థాలతో చెలగాటం ఆడవద్దని, మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని యువతకు సూచించారు. విద్యార్థి దశలో విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తీవ్ర ప్రమాదస్థాయికి చేరుకుంటారని, క్యాన్సర్, ఇతర ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని విద్యార్థులకు మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహనా కార్యక్రమాన్ని స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. అనంతరం జోనల్ కోఆర్డినేటర్ బి.రవి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు బానిసైనవారు నవజీవన్ బాల భవన్ సంస్థ వారు నూజివీడు మండలం పోలసానిపల్లిలో ఏర్పాటు చేసిన 'బోస్కో డీ అడిక్షన్ కేంద్రాన్ని' ఉచితంగా ఫోన్ నంబర్ ద్వారా 9490492020 సంప్రదించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం వార్డెన్ రాజ్ కుమార్, బాలిక వసతి గృహం వార్డెన్ ఉషారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భాస్కర్

## నేడు అమరవీరుల సంస్మరణ సభను

**ప్రజాశక్తి - టి.నరసాపురం**

భూమికోసం, భుక్తి కోసం, పీడిత ప్రజల విముక్తి కోసం ప్రాణాలర్పించిన విప్లవ అమర వీరులను స్మరించుకుంటూ మండలంలోని మర్రిగూడెంలో ఈనెల 27న నిర్వహించనున్న అమరవీరుల సభను జయప్రదం చేయాలని సిపిఐఎంఎల్ జిల్లా కార్యదర్శి భాస్కర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు సత్తిరాజు మర్రిగూడెంలో భూ పోరాటాలు చేసి 80 ఎకరాలకు పైగా సాధించి ఆదివాసి ప్రజలకు పంచారన్నారు. నవంబర్ 27న మర్రిగూడెం ప్రాంతంలో నిర్వహించే సత్తిరాజు సభను విజయవంతం చేయాలని ప్రజా సంఘాలకు, ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అరుణోదయ సాంస్కృతిక సమైక్య తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ విమలక్క పాల్గొంటున్నారన్నారు. ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుర్సం నిరీషణ రావు, కుంజా విరాస్వామి, కట్టం కటయ్య పాల్గొన్నారు.

## మహాధర్నాను జయప్రదం చేయాలి

**ప్రజాశక్తి - చింతలపూడి**

నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, రైతాంగ నల్లచట్టాలను ఉపసంహరించుకోవాలని ఈనెల 27న రాజధాని ఢిల్లీలో జరుగుతున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పట్టణంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం స్థానిక కారుమూడి సత్యనారాయణ రెడ్డి భవన్‌లో జిల్లా అధ్యక్షులు కూన పాముల విగ్నేశ్వర రావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ స్వతంత్రానికి పూర్వం సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం 44 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడానికి కార్మికవర్గం అంతా వ్యతిరేకిస్తుందన్నారు. వీటిని వెంటనే రద్దు చేయాలని ఈనెల 27, 28 తేదీల్లో రాజధాని కేంద్రాల్లో జరిగే ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి బొక్క శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కొత్తూరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## 'దేశ సమైక్యతకు కృషి'

**ప్రజాశక్తి - చింతలపూడి**

దేశ సమైక్యత, నైతిక విలువల కోసం డెభైఏళ్లుగా పాటు పడుతున్న సంస్థ జమాత్ ఇస్లామి హింద్ సంస్థ అని రాష్ట్ర జమాత్ ఇస్లామి హింద్ సంస్థ అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్ అన్నారు. ఆదివారం చింతలపూడి షాది ఖానాలో జమాతే ఇస్లామి హింద్ కార్యవర్గ సభ్యుల శిక్షణా కార్యక్రమం చింతలపూడి జమాతే ఇస్లామి హింద్ శాఖ, జామియా మసీదు కమిటీ అధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రఫీక్, రాష్ట్ర జమాతే ఇస్లామి ప్రధాన కార్యదర్శి మహమ్మద్ కరిముద్దిన్‌లు ముఖ్య ప్రసంగికులుగా పాల్గొన్నారు. నాలుగు సంవత్సరాల్లో జమా తే ఇస్లామి హింద్ చేపట్టే కార్యక్రమాలు, విధి విధానాల ప్రణాళిక గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ రఫీక్ మాట్లాడుతూ డెభై ఏళ్లుగా దేశంలో మత సామరస్యం కోసం, హిందూ, ముస్లిం, క్రైస్తవ, ఇతర మతాలను ఒకే వేదికపైకి తీసుకురావడం, అలానే స్వచ్ఛమైన ఇస్లామీయ బోధనల గురించి దేశ ప్రజలకు తెలపాలి అన్నదే జమాత్ ఇస్లామి హింద్ సంస్థ ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జమతె ఇస్లామి హింద్ అధ్యక్షుడు ముజాహిద్, వరంగల్ జమాత్ నాయకులు మౌలానా షాహ్ ఆలం, రియాజ్ ఫలాహి పాల్గొన్నారు.

## ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి - ఏలూరు**

డిసెంబర్ 3న జరగనున్న ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని దెందులూరు ఎంఎల్‌ఎ అబ్బయ్య చౌదరి అన్నారు. మహాసభ ప్రచార పోస్టర్‌ను ఆదివారం ఏలూరులోని తన నివాసంలో ఆయన ఆవిష్కరించారు. జిల్లా అడహాక్ కమిటీ నేతృత్వంలో జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు సయ్యద్ జాబీర్, కె.సోమశేఖర్, దెందులూరు నియోజకవర్గ అధ్యక్షులు ఎస్.రుషిరావు, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, కార్యదర్శి వెంకట్రావు పాల్గొన్నారు.

## నితీష్‌పై దాడికి ఖండన

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం చెముడు గుంట సచివాలయంలో విఆర్ఒ జుబేర్ అహ్మద్‌పై వైసిపి కార్యకర్త నితీష్ దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎపి రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల రాష్ట్రంలో ఉద్యోగస్తులపై కొంతమంది పార్టీల పేరుతో దాడులు చేస్తున్నారని, ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ముఖ్యమంత్రి ఆదేశాలు ఇవ్వాలని, దాడి చేసిన వారిపై నాన్ బేల్‌బుల్ సెక్షన్లు విధించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఇలాగే ఉద్యోగులపై దాడులు కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిస్తామని ఆయన ఈ ప్రకటన ద్వారా ప్రభుత్వాన్ని హెచ్చరించారు.